తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | బుధవారం - 18 - ఫిబ్రవరి 2026 | సంపుటి:3 | సంచిక:261 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in



# బయోఏషియా ఘన ఆరంభం

## హైదరాబాద్‌కు గ్లోబల్ లక్ష్యం
## పెట్టుబడులకు సీఎం రేవంత్ ఆహ్వానం
## జీనోమ్ వ్యాలీ విస్తరణకు ఊతం



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ జీవవిజ్ఞాన రంగంలో తెలంగాణను అగ్ర స్థానంలో నిలపాలనే సంకల్పంతో బయోఏషియా రెండువందల ఇరవై మూడు వ సంచిక హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సదస్సును ప్రారంభిస్తూ హైదరాబాద్‌ను ప్రపంచ వ్యాక్సిన్ రాజధాని నుంచి ప్రపంచ జీవవిజ్ఞాన రాజధానిగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర లక్ష్యాన్ని వెల్లడించారు. ముడి ఔషధాల తయారీ నుంచి జీవసాంకేతిక ఔషధాల ఆవిష్కరణల వరకు సమగ్ర పర్యావరణ వ్యవస్థను నిర్మించడంలో ప్రపంచ జీవవిజ్ఞాన రంగ నాయకులు భాగస్వాములు కావాలని సీఎం ఆహ్వానం పలికారు. కృత్రిమ మేధ, స్వయంచాలక వ్యవస్థలు, జీవవిజ్ఞాన విప్లవం ప్రధాన అంశాలుగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఔషధాలు, జీవసాంకేతికత, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల భవిష్యత్తును నిర్దేశించే వేదికగా ఇది నిలుస్తోందన్నారు. సమాచార సాంకేతిక మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో సదస్సు ప్రారంభమైంది. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులు, ఆవిష్కరణలు, వ్యాపార విస్తరణకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నదని సీఎం స్పష్టం చేశారు.

మిగతా 2లో..

# కూకట్‌పల్లిలో విషాద ఘటన

## మృతదేహంతో నాలుగు రోజుల ప్రార్థనలు
## స్థానికుల సమాచారంతో వెలుగులోకి



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలోని కూకట్‌పల్లి ప్రాంతంలో హృదయ విదారక సంఘటన చోటుచేసుకుంది. దేవుడు మళ్లీ బతికిస్తాడనే నమ్మకంతో చనిపోయిన కుమార్తె మృతదేహాన్ని ఇంట్లో ఉంచి కుటుంబ సభ్యులు నాలుగు రోజుల పాటు ప్రార్థనలు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

మిగతా 2లో..

# నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

- ప్రకాశం బజార్‌లో మంత్రి పర్యటన
- చిన్న వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలం హామీ
- రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులకు శ్రీకారం

**నల్గొండ, ఫిబ్రవరి 17 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** ప్రజల సహకారంతో నల్గొండ పట్టణాన్ని సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు ఈరోజు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రకాశం బజార్, లతీఫ్ షాప్ గుట్ట తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.

మిగతా 2లో..



# బీఆర్ఎస్ నేతలపై దాడిని ఖండించిన కేటీఆర్

- మంచిర్యాలలో చైర్మన్ ఎన్నికల వాయిదాపై ఆగ్రహం
- పోలీసుల లాఠీచార్జీ ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శ
- కాంగ్రెస్ అరాచకాలకు ప్రజల్లో గుణపాఠం తప్పదని హెచ్చరిక



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు పార్టీ నాయకులపై జరిగిన రాళ్ల దాడిని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ గుండాల దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకున్నప్పటికీ, చైర్మన్ ఎన్నికల్లో కౌన్సిలర్లు పాల్గొనకుండా అడ్డుకొని వాయిదా వేయడం దుర్మార్గ చర్య అని విమర్శించారు.

మిగతా 2లో..



సినీనటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు

# కీలక తీర్పు

నిందితుడు సిద్ధార్థరెడ్డి లొంగిపోవాలని ఆదేశం

లొంగిపోయేందుకు 4 వారాల గడువు

తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం ధర్మాసనం

# మోసానికి మారుపేరు కాంగ్రెస్: కవిత

## హామీలు అమలు కాలేదని విమర్శ
## బడ్జెట్‌లో నిధుల కేటాయింపు డిమాండ్






**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇరవై ఆరు నెలలు పూర్తయ్యినా మహిళలు, విద్యార్థినులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. మోసానికి మారుపేరు కాంగ్రెస్ అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

మిగతా 2లో..

# పోలీసు స్టేషన్‌కు ఎర్రబెల్లి తరలింపు

మద్దతుగా కవిత, రెడ్యా నాయక్ రాక

- మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్న మాజీ మంత్రి

**నర్సింహులపేట, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** తొర్రూరు మున్సిపల్ ఎన్నికల ఉద్రిక్తత నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును పోలీసులు నర్సింహులపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ పరిణామంతో రాజకీయ వర్గాల్లో ఉద్రిక్తత నెలకొంది. సంఘటన విషయం తెలిసిన వెంటనే ఆయన అనుచరులు, కార్యకర్తలు పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ కూడా ఎర్రబెల్లికి మద్దతుగా పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. పరిస్థితిని తెలుసుకుని అధికారులతో మాట్లాడారు.

మిగతా 2లో..





# జనగామలో లక్కీ డ్రాతో కాంగ్రెస్ విజయం

## ఇంద్రేశం బీఆర్ఎస్ ఖాతాలో.. పలు చోట్ల సమీకరణాలతో ఉత్కంఠ

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో వాయిదాపడిన పలు మున్సిపాలిటీల్లో ఈరోజు ఛైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైంది. సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మొత్తం పదెనిమిది వార్డుల్లో బీఆర్ఎస్ తొమ్మిది, కాంగ్రెస్ నాలుగు, భారతీయ జనతా పార్టీ రెండు, స్వతంత్ర అభ్యర్థి ఒక స్థానం గెలుచుకున్నారు. స్వతంత్ర అభ్యర్థి మద్దతుతో బీఆర్ఎస్ ఆధిక్యం సాధించింది. ఇంద్రేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా హరీశ్ రెడ్డి ఎన్నికయ్యారు. పటాన్‌చెరు పరిధిలోని గడ్డపోతారం, గుమ్మడిదల, జిన్నారం, ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీలను బీఆర్ఎస్ దక్కించుకుంది. స్థానిక స్థాయిలో బీఆర్ఎస్ బలాన్ని ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. జనగామ మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు సమానంగా పదహారు ఓట్లు రావడంతో లక్కీ డ్రా నిర్వహించారు. అదృష్టం కాంగ్రెస్ పార్టీని వరించింది. ఛైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి బాలమణి ఎన్నికయ్యారు. జనగామలో ముప్పై వార్డులకు గాను బీఆర్ఎస్ పదమూడు, కాంగ్రెస్ పన్నెండు, ఇతరులు ఐదు స్థానాలు గెలుచుకున్నారు. ఎక్స్‌ఆఫీషియో సభ్యులతో కలిపి మెజారిటీ సంఖ్య పదిహేడు కాగా, రెండు పార్టీలకు పదహారు మంది సభ్యుల చొప్పున మద్దతు లభించడంతో ఉత్కంఠ నెలకొంది.

మిగతా 2లో..



# గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం

## పారిశుధ్యం, తాగునీరు మెరుగుపరచాలని ఆదేశం
## స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యం: ఉప ముఖ్యమంత్రి

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తెలిపారు. ఈ క్రమంలో పంచాయతీల నిర్వహణ మరియు అభివృద్ధి పనుల కోసం రెండు వందల యాభై ఆరు కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. గ్రామీణాభివృద్ధికి ఈ నిధులు కీలకమవుతాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడం ద్వారా పల్లెల ప్రగతికి బాటలు వేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కొరతను తీర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బయోఏషియా ఘన ఆరంభం

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ జీవవిజ్ఞాన కేంద్రాలతో పోటీ పడే స్థాయిలో హైదరాబాద్‌ను పరిశోధన, రూపకల్పన, తదుపరి తరపు ఆరోగ్య పరిష్కారాల సమగ్ర కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.
గత రెండేళ్లలో జీవవిజ్ఞాన రంగంలో డెబ్బై మూడు వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు ఆకర్షించినట్లు తెలిపారు. జీవవిజ్ఞాన



విధానం ప్రకటించి, జీనోమ్ వ్యాలీ విస్తరణతో పాటు సమగ్ర పరిశోధన, ఆవిష్కరణలకు వన్ బయో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ఈ సదస్సులో ఐదు వందలకు పైగా అంతర్జాతీయ సంస్థలు, నాలుగు వేల మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వైద్య శాస్త్రానికి విశిష్ట సేవలందించిన ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్‌కు జీనోమ్ వ్యాలీ ఉత్తమత పురస్కారం అందజేశారు.

# బీఆర్‌ఎస్ నేతలపై దాడిని ఖండించిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, అన్యాయాన్ని ప్రశ్నించిన బీఆర్‌ఎస్ నాయకులపైనే లాఠీ చార్జ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కేటీఆర్ ఆరోపించారు. న్యాయం కోసం నిరసన తెలిపిన ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌లపై కేసులు నమోదు చేస్తామని బెదిరించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అని అన్నారు. జనగామలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతూ చేయి ఎత్తిన దళిత మహిళా కౌన్సిలర్ పట్ల కాంగ్రెస్ కౌన్సిలర్లు అసభ్యంగా ప్రవర్తించడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు ముఖ్యమంత్రి రేవంత్ నేతృత్వంలో అధికార కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అరాచక పాలన సాగిస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. ఈ విధానాలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

# సినీనటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** సినీ నటి ప్రత్యూష కేసులో నిందితుడు సిద్ధార్థ రెడ్డికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. నాలుగు వారాల్లో పోలీసుల ఎదుట లొంగిపోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు విధించిన రెండేళ్ల శిక్షను సుప్రీం ధర్మాసనం సమర్థించింది. పోస్టుమార్టంను అన్ ప్రొఫెషనల్‌గా నిర్వహించారని ఉన్నతన్యాయస్థానం వ్యాఖ్యానించింది.
కాగా, 2002 ఫిబ్రవరి 23న నటి ప్రత్యూష, ఆమె ప్రియుడు సిద్ధార్థ రెడ్డి కలిసి పురుగుల మందు కలిపిన కూల్ డ్రింక్ తాగడం తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రత్యూష మరుసటి రోజు మరణించగా.. సిద్ధార్థ రెడ్డి చికిత్స తర్వాత కోలుకున్నాడు. ఇది ఆత్మహత్యాయత్నమా



లేక ఆత్మహత్యకు ప్రేరేపించడమా అనే దానిపై వివాదం చెలరేగింది. ఇది హత్యే అని ప్రత్యూష తల్లి సరోజినీ దేవి ఆరోపించారు. సీబీఐ దర్యాప్తు తర్వాత సిద్ధార్థ రెడ్డిపై సెక్షన్ 306 కింద కేసు నమోదు అయ్యింది. ఈ క్రమంలో 2004లో సిద్ధార్థ రెడ్డికి సెషన్స్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది.
2011లో హైకోర్టు.. ఈ శిక్షను రెండేళ్లకు తగ్గించి, రూ.50,000 జరిమానా విధించింది. ఈ తీర్పుపై సిద్ధార్థ రెడ్డి, ప్రత్యూష తల్లి ఇద్దరూ 2012లో సుప్రీం కోర్టులో అప్పీల్ చేశారు. హైకోర్టు విధించిన జైలుశిక్షను సవాలు చేస్తూ నిందితుడు సిద్ధార్థరెడ్డి, అతడికి శిక్ష పెంచాలంటూ నటి ప్రత్యూష తల్లి సరోజిని సుప్రీం కోర్టును ఆశ్రయించారు. 2025 నవంబర్‌లో వాదనలు విన్న సుప్రీంకోర్టు.. తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఈ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టు తుది తీర్పు ఇచ్చింది. సిద్ధార్థ రెడ్డి పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం.. హైకోర్టు శిక్షను సమర్థించింది.

# పోలీసు స్టేషన్‌కు ఎర్రబెల్లి తరలింపు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు సమాచారం. పోలీసుల భారీ బందోబస్తు మధ్య పరిణామాలు కొనసాగాయి. మీడియాతో మాట్లాడిన ఎర్రబెల్లి దయాకర్ రావు భావోద్వేగానికి గురయ్యారు. కన్నీళ్లు పెట్టుకుంటూ కార్యకర్తల పట్ల తన అనుబంధాన్ని వ్యక్తం చేశారు. ఎన్నాళ్లుగానో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు తాను ఏమి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విధానాలు కాపాడాల్సిన బాధ్యత అందరిదని పేర్కొన్నారు. ఈ ఘటనతో తొర్రూరు రాజకీయాలు మరింత వేడెక్కాయి.



# సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రి పనులపై మంత్రి సమీక్ష

- **ఉగాది నాటికి పూర్తి సిద్ధం చేయాలని ఆదేశం**
- **ఫైర్ సేఫ్టీ, నీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి**
- **అధునాతన వైద్య పరికరాల పరిశీలన**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రి పనులను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయంగా పర్యవేక్షించారు. మెడికల్, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ, నీటి సరఫరా, విద్యుత్, రహదారులు-భవనాల శాఖల ఉన్నతాధికారులతో కలిసి టిమ్స్ అత్యవసర విభాగంలో సమీక్ష నిర్వహించారు. ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో ఆసుపత్రిని సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రికి నీరు, విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకం ఉండకూడదని, ఇరవై నాలుగు గంటల నిరంతర సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అగ్నిమాపక భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని, అన్ని అంతస్తుల్లో సమగ్ర పరిశీలన నిర్వహించాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. రిసెప్షన్ విభాగం, సహాయ కేంద్రం, బాహ్య రోగుల కౌంటర్లు, వేచి గది, వైద్యుల కన్సల్టేషన్ గదులు, నిర్ధారణ కేంద్రాలు, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ వంటి ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా బాహ్య రోగుల మరియు ఫార్మసీ కౌంటర్లు ఉండాలని సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్ వంటి అధునాతన పరికరాలను కూడా పరిశీలించారు. ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో రోగులకు ఉపయోగపడేలా అవసరమైన వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రహదారులు-భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, నీటి సరఫరా మరియు మలిన జలాల మండలి సంయుక్త నిర్వహణాధికారి మయాంక్ మిట్టల్, వైద్య విద్యాశాఖ అధికారి నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# లైఫ్ సైన్సెస్ పెట్టుబడులకు తెలంగాణ అగ్రగామి

- **బయోఏషియా వేదికగా ప్రపంచ దిగ్గజాలతో సీఎం భేటీ**
- **భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక జోన్ ప్రతిపాదన**
- **జీనోమ్ వ్యాలీలో భారీ ప్రాజెక్టులకు ఒప్పందాలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించి హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే అనేక సంస్థలు హైదరాబాద్‌ను కేంద్రంగా తీసుకుని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేశాయని పారిశ్రామిక వేత్తలకు వివరించారు. బయోఏషియా రెండు వేల ఇరవై ఆరు ప్రపంచస్థాయి సదస్సు ప్రారంభం సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి



ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో సీఎం భేటీ అయ్యారు. జీవవైజ్ఞానిక రంగంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ముఖ్యంగా ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటుకు అనుగుణంగా భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక జోన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారు. రాష్ట్రంలో విధాన స్థిరత్వం, మౌలిక వసతులు, నైపుణ్య వనరులు ఉన్నాయని పెట్టుబడిదారులకు వివరించారు.
భేటీ సందర్భంగా పలు పెట్టుబడి ఒప్పందాలు కుదిరాయి. ఒపెలా హెల్త్‌కేర్ అనే గ్లోబల్ వినియోగదారుల ఆరోగ్య సంస్థ నలభై రెండు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను విస్తరించనుంది. వచ్చే ఏడాదిలోపు ఐదు వందల ఉద్యోగాలను కల్పించనుంది. ఇండొనేషియాకు చెందిన జేఏపీఎఫ్ఏ సమూహంలోని వాక్సిండో ఎనిమల్ హెల్త్‌కేర్ విభాగం జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక జీవ భద్రతా ప్రమాణాల వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పుతుంది. కోళ్లు, పశువులు, పందులు, జలచరాల కోసం అవసరమైన టీకాలను ఉత్పత్తి చేస్తుంది. ఏఐ, డేటా సైన్స్ రంగంలో పనిచేస్తున్న ట్రిడెన్స్ సంస్థ హైదరాబాద్ కేంద్రంగా కృత్రిమ మేధ ఆధారిత ఆరోగ్య సేవల విస్తరణకు ముందుకొచ్చింది. సుమారు పదెనిమిది వేల చదరపు అడుగుల ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ సంస్థ జీనోమ్ వ్యాలీలో దాదాపు పన్నెండు ఎకరాల్లో ఒక మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంతో ఆధునిక పరిశోధనా కేంద్రాన్ని నిర్మించనుంది. వచ్చే ఆరేళ్లలో పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభించనుంది.
ఈ సమావేశంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. రాష్ట్రాన్ని ప్రపంచ లైఫ్ సైన్సెస్ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం పునరుద్ఘాటించారు.

# కూకట్‌పల్లిలో విషాద ఘటన

(మొదటి పేజీ తరువాయి)

చుట్టుపక్కల వారిచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. కైకలూరుకు చెందిన శమంతకమణి తన ముగ్గురు పిల్లలు జయరాం, శైలజ, సునీతలతో కలిసి కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో అద్దెకు నివసిస్తోంది. ముగ్గురు పిల్లలకూ వివాహం కాలేదని సమాచారం. అనారోగ్యంతో బాధపడుతున్న శైలజ ఇటీవల ఆసుపత్రిలో చేరగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. అయితే ఆమె మరణాన్ని కుటుంబ సభ్యులు అంగీకరించలేక తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. శైలజ మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు తలుపులు మూసుకుని ప్రార్థనలు ప్రారంభించారు. దేవుని ప్రార్థిస్తే ఆమె మళ్లీ బతికిస్తాడనే నమ్మకంతో అంత్యక్రియలు చేయకుండా ఆలస్యం చేశారు. రెండు రోజుల తరువాత ఇంటి నుంచి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన పొరుగువారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో విషయం బయటపడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు తెరిపించి పరిస్థితిని పరిశీలించారు. కుటుంబ సభ్యుల మానసిక స్థితిని అర్థం చేసుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారి సమ్మతితో మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామమైన కైకలూరుకు తరలించారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రకాశం బజార్‌కు ప్రతి రోజూ సుమారు పది వేల మంది ప్రజలు వస్తున్నారని, పెరుగుతున్న జనాభా మరియు వ్యాపారాలకు అనుగుణంగా రహదారులు లేకపోవడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాలు సంభవిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభించామని తెలిపారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేస్తున్న పూలు, పండ్లు మరియు చిన్న వ్యాపారులను పాత కలెక్టరేట్ కార్యాలయ స్థలానికి తరలించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఏ ఒక్క చిన్న వ్యాపారికి అన్యాయం జరగకుండా, వారి ఉపాధి దెబ్బతినకుండా ప్రత్యామ్నాయ స్థలం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో సుందరీకరణ పనులు చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో భూగర్భ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు, పటిష్టమైన సిమెంట్ కాంక్రీట్ రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. నల్గొండ నగరాన్ని పరిశుభ్రంగా, విశాలమైన రహదారులతో అభివృద్ధి చేసి ప్రజలందరికీ మేలు చేయడమే ఈ మార్పుల వెనుక ఉన్న అసలు ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే నగర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

# మోసానికి మారుపేరు కాంగ్రెస్: కవిత

(మొదటి పేజీ తరువాయి)




ఎన్నికల సమయంలో మహిళలకు ప్రతి నెల రెండు వేల ఐదు వందల రూపాయలు, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, నాలుగు వేల రూపాయల పింఛన్ పెంపు వంటి వాగ్దానాలు చేసినప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత తెలిపారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పడం సరికాదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో మహిళలకు రెండు వేల ఐదు వందల రూపాయల ఆర్థిక సహాయం, విద్యార్థినులకు స్కూటీలు, నాలుగు వేల రూపాయల పింఛన్ పెంపుకు తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. హామీలు నెరవేర్చకపోతే ప్రజల్లో అసంతృప్తి మరింత పెరుగుతుందని హెచ్చరించారు.

## గ్రామీణ మౌలిక సదుపాయాల

# అభివృద్ధికి ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకుని పారిశుధ్యం, తాగునీరు, అంతర్గత రహదారులు వంటి కనీస అవసరాలను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. గ్రామ ప్రజలకు నేరుగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు కొనసాగుతాయని బట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## జనగామలో లక్కీ డ్రాతో

# కాంగ్రెస్ విజయం

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్‌ఎస్ దక్కించుకోగా, టేకు సుదర్శన్ రెడ్డి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇల్లెందు మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుని దొడ్డ కిరణ్ మిత్రను చైర్మన్‌గా ఎన్నుకుంది. తొర్రూరు మున్సిపాలిటీలో పదహారు వార్డులకుగాను బీఆర్‌ఎస్ తొమ్మిది, కాంగ్రెస్ ఏడు గెలుచుకున్నప్పటికీ ఓటింగ్‌లో సమాన ఓట్లు రావడంతో లక్కీ డ్రాలో కాంగ్రెస్ విజయం సాధించింది.
నిన్న కోరం లేకపోవడంతో జనగామ, తొర్రూరు, ఇల్లెందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్ మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో ఈరోజు పలు చోట్ల చైర్‌పర్సన్ ఎన్నికలు ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి.

# చిన్న పాపను తప్పించబోయి బైక్ అదుపు తప్పి ప్రమాదం

- అక్కకు తీవ్ర గాయాలు
- సమయానికి స్పందించిన 108 సిబ్బంది



**సత్తుపల్లి, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

స్థానిక మండల పరిధిలోని కిష్టారం గ్రామంలోని అన్నపురెడ్డిపల్లి రోడ్డులో చిన్న పాపను తప్పించబోయి బైక్ అదుపు తప్పి ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనదారుడు తన అక్క, భార్యతో కలిసి కిష్టారం నుంచి చెరుకుపల్లి గ్రామానికి వెళ్తుండగా అకస్మాత్తుగా ముందుకు వచ్చిన చిన్న పాపను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి అక్క కూరం భద్రమ్మ (50) తీవ్రంగా గాయపడింది. ఆమె ఎడమ కాలు మడమ, పాదం తీవ్రంగా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న సత్తుపల్లి 108 సిబ్బంది ఈఎంటి గొల్లమందల కృష్ణ, పైలట్ ఏకాంత్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయాలకు కట్లు కట్టి, అవసరమైన ఇంజక్షన్లు అందిస్తూ, సెలైన్ బాటిళ్లు అమర్చి, ఆక్సిజన్ అందించారు. అలాగే మెడకు సీకాలర్ పెట్టి అంబులెన్స్‌లోనే ప్రాథమిక చికిత్స అందిస్తూ సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# పేద కుటుంబానికి 'యలమందల' ఆపన్నహస్తం

- నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, 25కిలోల బియ్యం, 2వేలు నగదు
- పేదలకు యలమందల జగదీష్ సేవలు ఆదర్శప్రాయం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు)**

ఆపదలో ఉన్న ఓ పేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, బియ్యం, ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్న మంచి మనసున్న నాయకులు, నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్. ఖమ్మం అర్బన్ మండలం, కైకొండాయిగూడెం, 1వ డివిజన్ కు చెందిన ఆంగోత్ భద్రు అంధుడు. అతనికి ప్రమాదం జరిగి కాలు ఇంపెక్షన్ తో నడవలేని పరిస్థితిలో కుటుంబ భారంతో ఉన్నాడు. అతనికి ఇద్దరు ఆడపిల్లలు. కుటుంబం గడవడమే కష్టంగా ఉంది. భద్రు కుటుంబ పరిస్థితిని గమనించిన నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు యలమందల జగదీష్ మానవత్వంతో మంగళవారం ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా నెలకు సరిపోయే నిత్యావసర వస్తువులు, 25కిలోల బియ్యంతో పాటు 2వేల రూపాయల నగదు ఇవ్వడం జరిగింది. పేద కుటుంబాన్ని ఆదుకున్న విషయం గ్రామమంతా చర్చిని అంశంగా మారింది. మానవత్వం ఇంకా బ్రతికే ఉంది. మంచి మనసులు మన మధ్యనే ఉన్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కనీసం బంధువులు కూడా ఇటువంటి సహాయాన్ని అందించరని బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. పేద కుటుంబానికి సాయం అందించిన యలమందల జగదీష్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, లాంబాడీ హక్కుల పోరాట సమితి భద్రు నాయక్, నూర్ భాషా జిల్లా ప్రధాన కార్యదర్శి మీరా, నూర్ భాషా అధికార ప్రతినిధి అన్వర్ పాషా, ఆంగోతు కిషోర్, తేజావత్ రాంకోటి, వీరస్వామి, పుల్లయ్య, శ్రీనివాస్, ఉబ్బనపల్లి రాము, తేజావత్ రమేష్, మహిళలు, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.



# కృతజ్ఞతలతో మంత్రిని కలిసిన కౌన్సిలర్లు

- ప్రచార జోష్‌తో కాంగ్రెస్‌కు గెలుపు గాలి
- సత్తుపల్లి సమరంలో తుమ్మల ముద్ర.

**సత్తుపల్లి, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో మంత్రి నిర్వహించిన ప్రచార సభలు, రోడ్ షోలు కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయని, స్తబ్దుగా ఉన్న పార్టీ శ్రేణులు సైతం చైతన్యంతో పనిచేసి విజయానికి దోహదపడ్డాయని వారు పేర్కొన్నారు. మంగళవారం దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో కౌన్సిలర్లు పాల్గొన్నారు. మంత్రి ప్రచారం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచి కాంగ్రెస్ వైపు మద్దతు పెరగడానికి కారణమైందని తెలిపారు. “మీరు ప్రచారానికి రావడం వల్లే మాలో ధైర్యం పెరిగింది” అంటూ మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి తుమ్మల రాకతో సత్తుపల్లిలో నెలకొన్న సానుకూల వాతావరణమే తమ విజయానికి కారణమైందని ఎమ్మెల్యే రాగమయి పేర్కొన్నారు. గెలిచిన ప్రజాప్రతినిధులను అభినందించిన మంత్రి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. సత్తుపల్లి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందుతుందని ఆయన భరోసా ఇచ్చారు.

# శ్రీరంగాపూర్–పెబ్బేరు బస్సు సేవలు పునరుద్ధరించాలి

- శ్రీరంగాపూర్ మండల నాయకులు

**వనపర్తి,ఫిబ్రవరి17(తెలంగాణ ముచ్చట్లు):**



శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మండల నాయకులు టీజీఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిశారు. మండల ప్రజలు, రైతులు, భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారికి వివరించారు.ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, శ్రీరంగాపూర్ ఉపసర్పంచ్ కళ్యాణికారి ఖాజా, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్. వెంకటస్వామి మరియు ఇతర నాయకులు మాట్లాడుతూ.. శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి ప్రస్తుతం బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం మరియు మండల అభివృద్ధి కార్యాలయాలకు తమ పనుల కోసం వచ్చే రైతులు, ప్రజలు, అలాగే పుణ్యక్షేత్రమైన శ్రీరంగాపూర్ ఆలయానికి వచ్చే భక్తులు రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గతంలో శ్రీరంగాపూర్ నుండి పెబ్బేరు వరకు రోజుకు ఎనిమిది సార్లు బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం ఆ సేవలు నిలిచిపోయినట్లు తెలిపారు. వెంటనే పాత విధానంలోనే బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని డిపో మేనేజర్‌ను కోరారు.అదేవిధంగా మార్చి నెలలో జరిగే జాతర ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపాలని మండల నాయకులు విజ్ఞప్తి చేశారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కళ్యాణికారి ఖాజా, సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్. వెంకటస్వామి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి సందర్భంగా సత్తుపల్లి డిపోకు రూ. 8,44,428 ఆదాయం

- నీలాద్రికి 26 ప్రత్యేక బస్సులు

**సత్తుపల్లి, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సత్తుపల్లి డిపో నుండి నీలాద్రికి ప్రత్యేకంగా 26 బస్సులు నడపగా మొత్తం రూ. 8,44,428 ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ ఉదయం 4 గంటల నుంచి 16వ తేదీ ఉదయం 6 గంటల వరకు ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు నడిపినట్లు వివరించారు. ఈ ప్రత్యేక సర్వీసుల ద్వారా ఈపికె 92.66, ఓఆర్ 142 నమోదు కాగా, మొత్తం 9,113 కిలోమీటర్లు ఆపరేట్ చేసినట్లు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే రూ. 26,000 అదనపు ఆదాయం వచ్చినట్లు చెప్పారు.
మొత్తం 23,422 మంది ప్రయాణికులు ఈ బస్సుల్లో ప్రయాణించగా, వారిలో 14,127 మంది మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణించినట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 500 మంది ప్రయాణికులు అదనంగా బస్సులను వినియోగించినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులను ఆదరించిన ప్రయాణికులకు ఈ సందర్భంగా డిపో మేనేజర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి. ప్రవీణ్ కుమార్, మెకానికల్ ఇంజనీర్ ఎస్. సాహితి పాల్గొన్నారు.



# జవహర్‌నగర్‌లో అక్రమ కట్టడాల కూల్చివేత

- తహసీల్దార్ సీరియస్
- పత్రాలు చూపకపోతే మళ్లీ జెసీబీ: ఆర్ఐ హెచ్చరిక

**జవహర్‌నగర్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**



ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. మేడ్చల్ జిల్లా కాప్రా మండలం జవహర్‌నగర్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను మంగళవారం జెసీబీ సహాయంతో కూల్చివేశారు. ఎమ్మార్వో ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రమేష్ ఆధ్వర్యంలో ఈ చర్యలు కొనసాగాయి.9వ వాడు శాంతినగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఓ ఇంటిని కూల్చివేయడానికి అధికారులు వెళ్లగా ఉద్రిక్తత నెలకొంది. మాజీ కార్పొరేటర్ శారద-మనోహర్ రెడ్డితో పాటు కొందరు స్థానిక మహిళలు అధికారులను అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. సదరు నిర్మాణానికి జీవో 58, 59 కింద పత్రాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు.
అయితే పత్రాలు ఉంటే ఎమ్మార్వో కార్యాలయంలో ఎందుకు సమర్పించలేదని ఆర్ఐ రమేష్ ప్రశ్నించారు. వెంటనే సంబంధిత పత్రాలను కార్యాలయంలో సమర్పించి ధృవీకరించుకోవాలని, అప్పటివరకు నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పత్రాలు చూపని పక్షంలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే కూల్చివేతలు పూర్తి చేస్తామని హెచ్చరించారు.ఇదే సందర్భంగా సర్వే నంబర్ 415లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన గోడలను అధికారులు నేలమట్టం చేశారు. కాప్రా తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా అక్రమ కట్టడాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్ పాల్గొన్నారు. ప్రభుత్వ భూముల రక్షణలో భాగంగా కఠిన చర్యలు కొనసాగుతాయని రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

# జ్యోతి నగర్‌లో అనాథ వృద్ధురాలు పోచమ్మ మృతి

- మాల్యవి కరుణోదయ సొసైటీ ట్రస్ట్ చైర్మన్ కొండ కృష్ణమ్మ నుంచి రూ.10 వేల ఆర్థిక సహాయం

**జవహర్ నగర్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ డివిజన్ జ్యోతి నగర్ కాలనీలో అనాథగా జీవనం సాగిస్తున్న పోచమ్మ అనే వృద్ధురాలు మంగళవారం మృతిచెందింది.ఇళ్లల్లో పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించిన పోచమ్మకు ఇద్దరు కూతుర్లు ఉన్నప్పటికీ, వారి వివాహాల అనంతరం ఎవరూ పట్టించుకోకపోవడంతో గత ఐదేళ్లుగా బాలాజీ నగర్-జ్యోతి నగర్ ప్రాంతంలో ఒంటరిగానే నివసిస్తోంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆరోగ్యం క్షీణించడంతో కన్నుమూసింది.ఈ విషయం తెలిసిన స్థానికులు మానవతా దృక్పథంతో స్పందించి అంత్యక్రియల నిమిత్తం తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. సమాచారం అందుకున్న మాల్యవి కరుణోదయ సొసైటీ ట్రస్ట్ చైర్మన్ కొండ కృష్ణమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని పార్థివదేహానికి నివాళులర్పించారు.అంత్యక్రియల నిర్వహణ కోసం స్వయంగా రూ.10,000 ఆర్థిక సహాయం అందజేసి కార్యక్రమాన్ని ముందుండి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అనసూయ, ప్రసాద్, ప్రకాష్, ప్రేమ, సునీతతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు. అనాథ వృద్ధురాలి అంతిమ యాత్రకు సహకరించిన స్థానికుల సేవాభావాన్ని పలువురు ప్రశంసించారు.



# న్యాయవాదుల భద్రతపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతి

- తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ల సమాఖ్య తరపున వినతి పత్రం సమర్పణ

**మేడ్చల్ మల్కాజ్గిరి, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ల సమాఖ్య తరపున ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్. అమరేందర్ రెడ్డి, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసి న్యాయవాదుల సంక్షేమం, భద్రతకు సంబంధించిన అంశాలపై వినతి పత్రం సమర్పించారు.ఇటీవలి కాలంలో న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, ఈ అంశాన్ని ప్రజాహిత వ్యాజ్యంగా (పీఐఎల్) స్వీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సిఫారసులు చేయాలని కోరారు. న్యాయవాదుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావడం, కోర్టు ప్రాంగణాల్లో భద్రతా ఏర్పాట్లు బలోపేతం చేయడం, దాడులపై కఠిన చర్యలు తీసుకోవడం వంటి అంశాలను వినతి పత్రంలో ప్రస్తావించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణతో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. న్యాయవాదుల గౌరవం, భద్రత పరిరక్షణ కోసం సమాఖ్య కట్టుబడి ఉందని వారు పేర్కొన్నారు.



# ఈసీఐఎల్ బస్ స్టాప్ వద్ద విషాదం




- బస్సు ప్రమాదంలో వృద్ధ మహిళ మృతి

**కుషాయిగూడ, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధి లో ఈసీఐఎల్ బస్ స్టాప్ వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో ఓ వృద్ధ మహిళ మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది.పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం,నాగార్జున నగర్ కాలనీ, శుభోదయం కాలనీకి చెందిన చిట్యాల లక్ష్మి (64) మంగళవారం మధ్యాహ్నం సుమారు 2:21 గంటల సమయంలో తన పని ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు ఈసీఐఎల్ బస్ స్టాప్ వద్ద బస్సు నెంబర్ 281 (రిజిస్ట్రేషన్ నం. TS03Z0324) ఎక్కే ప్రయత్నం చేశారు. ఈ బస్సు ఈసీఐఎల్ నుంచి ఘట్కేసర్ వైపు వెళ్తోంది.ఈ సమయంలో డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును కదిలించడంతో లక్ష్మి మెట్లపై నుంచి జారి కిందపడిపోయారు. వెంటనే బస్సు టైర్లు ఆమె పాదాలపైకి వెళ్లడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. అక్కడున్న వ్యక్తి సమాచారం మేరకు ఆమె కుమారుడు చిట్యాల నరసింహ (39) సంఘటనా స్థలానికి చేరుకుని తన తల్లిని వెంటనే గాంధీ హాస్పిటల్ కు తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి కుమారుడు నరసింహ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నిర్లక్ష్యంపై విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## కీసరగుట్టలో శ్రీ భవాని రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం

**కీసర, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు)**



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ డివిజన్ లోని కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఐదవ రోజు బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్నాభిషేకం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ చైర్మన్ టి. వెంకటేశ్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి విశేష పూజలు నిర్వహించి అన్నాభిషేకం చేశారు.అన్నాభిషేకంలో భాగంగా స్వామివారిని అన్నంతో అలంకరించి, ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. వేద పండితులు సత్యనారాయణ శర్మ, బలరామశర్మ, రవి శర్మలు పూజా కార్యక్రమాలు నిర్వహించి శాంతి హోమాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్నాభిషేకం చేయడం వల్ల ప్రకృతి అనుకూలంగా ఉండి రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని, ప్రజలకు అన్నదాతల ఆశీర్వాదం లభిస్తుందని తెలిపారు.బ్రహ్మోత్సవాల వేళ కీసరగుట్టలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల రద్దీతో కళకళలాడాయి.
దేవస్థానం అధికారులు భక్తులకు తాగునీరు, ప్రసాదాల పంపిణీ, క్యూలైన్ నిర్వహణ వంటి ఏర్పాట్లు సమర్థంగా చేపట్టారు. మొత్తం మీద మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన అన్నాభిషేకం కార్యక్రమం ఘన విజయవంతమైంది.



## బీసీలకు రాజ్యాధికారం దక్కాల్సిందే

**- ముకుంద నాయుడు బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి**

**వనపర్తి,ఫిబ్రవరి17(తెలంగాణ ముచ్చట్లు):**

బీసీలపై జరుగుతున్న అన్యాయాలను ఇకపై సహించబోమని, బీసీలకు రాజ్యాధికారం దక్కాల్సిన సమయం వచ్చిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుంద నాయుడు అన్నారు.వనపర్తి పురపాలక సంఘం అధ్యక్ష ఎన్నికల సందర్భంగా బీసీ వర్గానికి చెందిన నాయకుడు చీర్ల చందర్ అన్యాయానికి గురయ్యారని ఆరోపించారు.ఆయనకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు.బీసీలను ముందుంచి నమ్మకద్రోహం చేస్తున్న అగ్రకుల నాయకత్వాన్ని అన్ని రాజకీయ పార్టీల్లో బహిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, శాసనసభ ఎన్నికల్లో బహుజనులతో కలిసి బీసీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. ఈసారి ప్రధాన రాజకీయ పార్టీలు శాసనసభ అభ్యర్థులుగా బీసీలకు అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. వనపర్తిలో బీసీ వర్గానికి చెందిన ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు సమాజం సిద్ధమవుతోందని తెలిపారు.పార్టీలను బలపరచేది బీసీ నాయకులేనని, అయితే పదవులు మాత్రం అగ్రకులాలకే దక్కుతున్నాయని విమర్శించారు. బీసీ నాయకులు ఇకపై తమ హక్కుల కోసం పోరాడాలని, ఇతరులను గద్దెపై కూర్చోబెట్టే స్థితి నుంచి బయటపడి స్వయంగా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. రాజకీయం ధనికులకే పరిమితం కాదని, సమాజ సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరికీ రాజకీయ హక్కు ఉందని పేర్కొన్నారు.అగ్రకులాల ధన రాజకీయాల నుంచి బయటపడి బీసీలు స్వయంగా పాలనలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవింద్ స్వామీ, సంఘం ఉపాధ్యక్షుడు చిట్యాల రాము, బీసీ వర్గ నాయకుడు చీర్ల చందర్, బీసీ యువజన సంఘం ప్రతినిధులు శివ, చందు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ పోరులో కాంగ్రెస్ జైత్రయాత్ర – ముఖ్యమంత్రిని కలిసిన నేతలు

**వనపర్తి,ఫిబ్రవరి17(తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. దాదాపు 90 శాతం మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగిరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ శాసనసభ్యుడు కూచుకుల్ల రాజేష్ రెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ అధ్యక్షుడు, వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి కలిసి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిను కలిసి అభినందనలు తెలిపారు.పెబ్బేరు, వనపర్తి మున్సిపాలిటీలను కూడా కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పట్ల ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తూడి మేఘారెడ్డి తెలిపారు.





# చిన్న పత్రికలపై సర్కారు వివక్షకు నిరసనగా కదం తొక్కిన కలం కార్మికులు

**◆ సమాచార భవన్ భవన్ వద్ద జర్నలిస్టుల ఆందోళన**

**ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు)**

కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న, మధ్య తరహా పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వకుండా, ఎంప్యానల్‌మెంట్ చేయకుండా వివక్ష చూపుతున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళ వారం ఆయా పత్రికల జర్నలిస్టులు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని సమాచార పౌర సంబధాల శాఖ కమీషనర్ కార్యాలయం (సమాచార భవన్) ఎదుట ఆందోళన చేపట్టారు.
**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్** (టీడబ్ల్యూజేఎఫ్) ఇచ్చిన "ఛలో సమాచార భవన్" పిలుపు మేరకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన చిన్న, మధ్య తరహా పత్రికల నిర్వహకులు, పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ర్యాలీగా వెళ్లిన జర్నలిస్టులు దాదాపు రెండు గంటల పాటు కార్యాలయం ప్రవేశ ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)
వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్వరాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగుతుందని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఈసారి 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ, కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు,చానళ్ళకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్దతిని తుంగలో తొక్కి పత్రికలకు ఎంప్యానల్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న,మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు.
తెలంగాణ స్వరాష్ట్రం లోనే చిన్న మధ్య తరహా పత్రికలకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా...అనేక పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారనని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మబలికిన పాలకులు మీడియా అక్రిడిటేషన్ ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సందర్భాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే అడ్వర్టయిజ్మెంట్ తో పాటు అక్రెడిటేషన్ ఇచ్చే వారని, ప్రస్తుతం అడ్వర్టయిజ్మెంట్ల సంగతి దేవుడెరుగు గానీ.. కనీసం అక్రెడిటేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వివక్ష కారణంగా స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, దీని వల్ల ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులకు పత్రికల నిర్వహణ భారమవుతుందని అన్నారు. దీనికి తోడు మూలిగే నక్కమీద తాటికాయపడ్డట్టు ఎంప్యానల్‌లో ఉన్న పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించడం చాలా భాదాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఆర్ఎన్ఐ ,పీఆర్జీఐ
రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి పత్రికకు అక్రిడిటేషన్ కార్డులు గతంలో మాదిరిగా ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. అదే విధంగా ఆయా పత్రికలకు ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని, ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు తన్నీరు శ్రీనివాస్, కె. పాండురంగా రావు, పద్మనాభరావు, యర్రమిల్లి రామారావు, హైదరాబాద్ జిల్లా నాయకులు వి. రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం, సంతోష్, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్, నాయకులు డప్పు రామస్వామి ,శంకర్, శివకుమార్,సంజీవ్ కుమార్, మంజులారెడ్డి, సౌభాగ్యవతి, సుష్మిత, శివపార్వతి, సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్వాయి జానయ్య, హరి ప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, నిజామాబాద్ జిల్లా నేతలు కుంచెం శ్రీనివాస్, పానుగంటి శ్రీనివాస్, యార్వ నరేష్, మహాదేవ్ ప్రసాద్ రాజు, నల్గొండ జిల్లా నాయకులు వెలుతురు యాదయ్య, జీడిమట్ల రవీందర్, నాగయ్య, పరమేష్, లింగస్వామి, ఖమ్మం జిల్లా నాయకులు అర్వపల్లి నగేష్, వెలుగోటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ జగన్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు.

# కల్లూరులో ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

**- సండ్ర నాయకత్వంలో కేక్ కట్ .**
**- రోగులకు పాలు, పండ్లు పంపిణీ.**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**





కల్లూరు పట్టణ కేంద్రంలోని మెయిన్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమ యోధుడు, రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్య మంత్రి గౌ. కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య నాయకత్వంలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మండల పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి దేశానికే దిక్సూచిగా నిలిచాయని కొనియాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలకు మధ్య ఉన్న తేడాను ప్రజలు ఇప్పటికే గ్రహించారని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ ప్రభుత్వ ఏర్పాటు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సారథ్యంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేశారని అభినందించారు. ఎన్నికల్లో గెలుపు-ఓటములు సహజమని, ఎవరూ నిరుత్సాహపడవద్దని సూచించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ కేడర్ మరింత శక్తిని సమీకరించుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కట్టా అజయ్ కుమార్, డాక్టర్ లక్కినేని రఘు, పెడకంటి రామకృష్ణ, కాటంనేని వెంకటేశ్వరరావు తదితరులు, కల్లూరు నూతన మున్సిపాలిటీకి ఎన్నికైన బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పట్టణ-మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా “జై కేసీఆర్”, “జై కేటీఆర్”, “జై సండ్ర” నినాదాలతో ప్రాంతం మార్మోగింది.

# పెద్దమందడిలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**పెద్దమందడి,ఫిబ్రవరి17(తెలంగాణ ముచ్చట్లు):**




కల్వకుంట్ల చంద్రశేఖర రావు 72వ జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్దమందడి మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పి. జగదీశ్వర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు రఘుపతి రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు సేనాపతి కలిసి కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ సాధనలోనూ, రాష్ట్ర అభివృద్ధిలోనూ కేసీఆర్ పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, పదేళ్ల పాలనలో రాష్ట్ర రూపురేఖలను మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు.తెలంగాణ ఉన్నంతకాలం ఆయన అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు.రైతుబంధు, మిషన్ భగీరథ వంటి పథకాల ద్వారా దేశానికి దిక్సూచిగా నిలిచిన నాయకుడు కేసీఆర్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ ప్రభుత్వంలోనే లబ్ధి పొందారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు జంగం రమేష్, పురుషోత్తం రెడ్డి, అధికార ప్రతినిధి సింగిరెడ్డి కురుమూర్తి, హరికుమార్ రెడ్డి, ఆశిరెడ్డి, వార్డు సభ్యులు కొమ్ము బ్రహ్మయ్య, కొమ్ము విష్ణు, వాకిటి నాగభూషణం, సూర శ్రీనివాసులు, కడుకుంట్ల సత్యన్న, కుమ్మరి కొండన్న, కడుకుంట్ల ఆంజనేయులు, కొత్త వెంకటన్న, సింగిరెడ్డి వెంకటస్వామి, గుడిసె మల్లేష్, గొడుగు రామచంద్రయ్య, మురళీ గౌడ్, యండి రఫి, యండి ఇత్తూ, ఆల్వాల గ్రామ మాజీ సర్పంచ్ సువర్ణ జగన్మోహన్ రెడ్డి, జీ. బాల్ రెడ్డి, రఘు, అహ్మద్ ఆలీ తదితరులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు అత్యధిక పరిహారం..

◆ **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి- 17(తెలంగాణ ముచ్చట్లు)**





సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం మంజూరు చేసి, భూనిర్వాసితుల ఖాతాలకు జమచేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ మంగళవారం సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాలలో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ కు సంబంధిత రైతులతో జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలలో సీతా రామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా, భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించామని అన్నారు. ప్రాజెక్ట్ రావాలని, అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి, భూసేకరణ చేయాలని ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ప్రాజెక్టుతో సాగునీరు అంది, అక్కడి భూములు సారవంతం అవుతాయన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిలో ఉన్న వ్యవసాయ పంపు సెట్ల, చెట్లు, సుబాబుల్ చెట్లు, ఇతర నిర్మాణాలకు సెపరేట్ గా పరిహారం అందించామని అన్నారు. సుబాబుల్ చెట్లకు అటవీ శాఖ చే అంచనాలు చేయించి, పరిహారం అందించామన్నారు. రైతుల కోరిక మేరకు అటవీశాఖ అధికారులచే మరోసారి పరిశీలనలు చేసి, సుబాబుల్ చెట్ల విషయమై తగు న్యాయం చేస్తామన్నారు. కలెక్టర్ గా తనకున్న అధికారాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ట పరిహారం అందజేసినట్లు, భూ నిర్వాసిత రైతులందరూ అంగీకరించి, భూ సేకరణకు సహకరించాలని, పనులకు ఆటంకం కల్గించవద్దని కలెక్టర్ అన్నారు.

ఈ సమావేశంలో ఎస్.డి.సి. ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఇరిగేషన్ ఇఇ కె. బాబూరావు, డిఇ ఎస్. కిషోర్, సింగరేణి మండల తహసీల్దార్ ఆనంతుల రమేష్, నిర్వాసిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు బాసట

◆ **టాపర్లకు రూ. 10,000 నగదు బహుమతి ప్రకటన**

◆ **ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు)**



తల్లిపై ఉన్న మమకారాన్ని విద్యార్థుల సేవలో చాటుకున్నారు నాగిలి గొండ గ్రామానికి చెందిన షేక్ షరీఫ్ ప్రొద్దుటూరు గ్రామంలోని హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సమయంలో అండగా నిలిచేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తన మాతృమూర్తి స్వర్గీయ మదార్ బీ గారి జ్ఞాపకార్థం విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మధిర నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు కిట్లను అందజేశారు.

**పరీక్షా సామాగ్రి పంపిణీ:**

రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసేలా రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు తదితర సామాగ్రితో కూడిన కిట్లను మదార్ బీ స్మారకార్థం షరీఫ్ అందజేశారు.

**ప్రతిభావంతులకు నగదు పురస్కారం**

ఈ సందర్భంగా షరీఫ్ విద్యార్థుల్లో చదువు పట్ల ఉత్సాహాన్ని పెంచేలా ఒక కీలక ప్రకటన చేశారు. పదో తరగతి వార్షిక ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ మరియు ద్వితీయ స్థానాలు సాధించిన ప్రతిభావంతులకు ₹10,000 (పది వేల రూపాయల) నగదు బహుమతిని అందజేస్తామని ప్రకటించారు. బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ, మాతృమూర్తి పేరు మీద విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు:**

మాతృమూర్తి జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందించడంతో పాటు, టాపర్లకు నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించడంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు షరీఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయ బృందం మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





# పండుగలను మత సామరస్యంతో జరుపుకోవాలి.!

◆ **సత్తుపల్లి ఇన్స్పెక్టర్ టి శ్రీహరి.**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

రంజాన్ పండుగను, ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో మత సామరస్యంతో జరుపుకోవాలని సత్తుపల్లి ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి శాంతి కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. రంజాన్, శివాజీ జయంతి ఉత్సవాల సందర్భంగా కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో మత సామరస్యాన్ని కాపాడటానికి పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. పండుగ వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రార్ధనల సమయంలో అలాగే శివాజీ జయంతి ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు సహకరించాలని కమిటీ సభ్యులను, మత పెద్దలను కోరారు. శాంతి నెలకొల్పే విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైతే శాంతి భద్రతలు సక్రమంగా ఉంటాయో అక్కడ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని తెలిపారు. పండుగ వేడుకలు ప్రశాంతంగా సాగేందుకు ప్రజలు సమన్వయంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

# జమాఅతె ఇస్లామ్ హింద్ మహిళా శాఖ ఆధ్వర్యంలో రమజాన్ స్వాగత సభ

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు)**





దివ్యఖుర్ఆన్ బోధనలు మానవాళికి ఇహంలోనూ, పరంలోనూ దారిచూపుతాయని, మంచి, చెడుల విచక్షణ చూపే ఈ గ్రంథం రమజాన్ నెలలో అవతరించి ప్రాముఖ్యం లభించిందని జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ కార్యవర్గ సభ్యురాలు నాసిరా ఖానమ్ సాహిబా అన్నారు. జమాఅతె ఇస్లామీ హింద్ ఖమం జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్ అధ్యక్షతన స్థానిక ఉర్దు ఘర్ షాదీఖానా నందు నిర్వహించిన రాబోయే రమజాన్ నెలను పురస్కరించుకొని రమజాన్ నెల స్వాగత సమావేశంలో ఆమె మాట్లాడుతు దివ్యఖుర్ఆన్ సమస్త మానవాళికంతటికి మార్గదర్శక గ్రంధమన్నారు. దైవుని అభీష్టం, మానవుని జీవన విధానం తెలియజేసే పవిత్ర గ్రంథమే దివ్య ఖుర్ఆర్. అల్లాహ్ ఆదేశాలు బోధనలు లోకానికి అందించిన అధ్యాత్మిక సారం. ఖుర్ఆన్ అంటే పఠించే గ్రంథం. ఈ మాసంలో అధికంగా ఖుర్ఆన్ ఏకాగ్రతతో అర్థం చేసుకుంటూ పఠించాలి దైనందిన కార్యక్రమాలకు తక్కువ సమయాన్ని కేటాయిస్తు మిగిలిన కాలమంతా దైవనామ స్మరణ, ఖుర్ఆన్ పఠన ఆరాధనల్లో గడపాలని అన్నారు. ప్రకృతి వనరులైన గాలి, నీరు, సూర్యరశ్మి ఏవిధంగా మానవాళి సొంతమో ఖుర్ఆన్ గ్రంథమూ అందరి సొంతమని, ఇది ఏ ఒక్కరి సొత్తూ కాదని ఆయన అన్నారు. అనంతరం జమాఅతె ఇస్లామీ హింద్ హైదరాబాద్ సభ్యురాలు అర్జుమన్ద్ రిజ్వి సాహెబా మాట్లాడుతు రంజాన్ మాసం అందరికి శుభాలు. క్రమశిక్షణ, సహనం, దాతృత్వాల కలయికే రంజాన్ నెల అన్నారు. ఉపవాసాల ప్రత్యేకత, జకాత్ ప్రాముఖ్యత గురించి ముస్లిం మహిళలందరికి అవగాహన ఉండాలన్నారు.రంజాన్ నెలలో ఉపవాసం ఉంటు గర్వం, ఈర్ష్య, చాడీలు చెప్పడం, అసత్యాన్ని పలకడం, అసత్యాన్ని ఆచరించడం మానని వారు ఉపవాసం పాటిస్తున్నట్లు కాదన్నారు. అందుకే ప్రతి వ్యక్తి భక్తిశ్రద్ధలతో ఉపవాసం పాటించాలని అన్నారు. రంజాన్ నెలలో ఉపవాసాలు ఉంటూ ఏ విధంగా అయితే సత్కార్యాలు ధానధర్మాలు చేస్తున్నాము మిగతా కాలంలో కూడా అలాగే ఉండాలని అన్నారు.అనంతరం జమాఅతె ఇస్లామి హింద్ సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్, నార్త్ అధ్యక్షురాలు హుస్నేన్ బి , సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుం ,వెస్ట్ అధ్యక్షురాలు ఫర్జానా రమజాన్ నెల గొప్పతనం మరియు మహిళలు పాటించవలసిన నియమాల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో జమాఅతె ఇస్లామి హింద్ జిల్లా మహిళా పబ్లిక్ రిలేషన్ కన్వీనర్ హాజీరా సదఫ్ ,కో కన్వీనర్ జహీరా, సెంట్రల్ ఉపాధ్యక్షురాలు షాజియా , సభ్యులు సైదా భాను , గౌసియా , వహెదా , ఆరిఫా, అతియా, సమీనా , రాఫిఖా, ఖాసిమ షాహిన్, నస్రీన్ , నసీమున్నిసా,తస్లీమ్ సుల్తానా, అబిదా సల్మా , అఫ్‌రోజ్, నూరీ అఫ్ష , అయిషా , సుమయ్య, ఫర్జానా,ఫాతిమా, సీమ అతహర్, సల్మ అఫ్‌రోజ్, నూర్జహన్, షభానా, సబిహా మరియు మహిళలు పాల్గొన్నారు.



# ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న పత్రికలకూ అక్రెడిటేషన్లు ఇవ్వాలి

◆ **మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు)**

కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న,మధ్య తరహా పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర సమాచార, పౌర సంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన పలువురు ఫెడరేషన్ నాయకులు సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

మామిడి సోమయ్య మంత్రితో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్వరాష్ట్రంలో గత పదేండ్లు చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగిందని,ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వంలో న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మీడియా సంస్థలకు ఈ సారి 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ, కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు,చానళ్ళకు మాత్రమే ఇస్తున్నారని, ఎంపానల్ కాని ఆర్ఎన్ఐ,

పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అమిగతా పత్రికలకు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఇవ్వడం లేదని, ఎంపానల్మెంట్ అనేది కేవలం ప్రభుత్వ అడ్వర్టయిజ్మెంట్లకే అని ఆయన మంత్రికి వివరించారు.

ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయాలని,అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కోకన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, నాయకులు హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి .రవికుమార్, కో కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం, సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్వాయి జానయ్య, హరి ప్రసాద్ తదితరులున్నారు.



# బస్తీ బాటలో శ్రీనివాస కాలనీ పర్యటన

◆ **నెమలి అనిల్ కుమార్**

**మల్లాపూర్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

కాలనీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ అన్నారు. “బస్తీ బాట” కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సాయి గార్డెన్స్ సమీపంలోని శ్రీనివాస కాలనీలో ఆయన విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులతో సమావేశమై వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రోడ్లు, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక వసతులపై ప్రజలు వివరించిన సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించినట్లు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న నెమలి అనిల్ కుమార్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో కాలనీలోని ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం అందిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవింద్, వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. లైక్, జాయింట్ సెక్రటరీ ఎం.డి. ముజఫర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి. సురేష్ గౌడ్, పి. కృష్ణ, పి. సుమన్ తదితరులు పాల్గొన్నారు.కాలనీల అభివృద్ధి కోసం ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకత అని నాయకులు పేర్కొన్నారు.



# జేఈఈ మెయిన్ సెషన్–1 ఫలితాల్లో వైబ్రెంట్ విద్యార్థుల విజయదుందుభి

**హైదరాబాద్,ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

జనవరి 16 నుంచి జరిగిన జేఈఈ మెయిన్ సెషన్ 1 ఫలితాల్లో వైబ్రంట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ పరీక్షల్లో చదివిన విద్యార్థులు సెకలంగా 99.99 శాతం వరకు పర్సెంటైల్ సాధించగా, ఓ విద్యార్థి 99.24 పర్సెంటైల్ నమోదు చేశారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ చిట్టీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కోటా రాజస్థాన్ విధానాన్ని అనుసరిస్తూ హనుమకొండ కేంద్రంలో ప్రత్యేక బోధన, కోటా డైరెక్ట్ పర్యవేక్షణలో తయారుచేసిన స్టడీ మెటీరియల్, మైక్రో షెడ్యూల్ ఆధారంగా నిర్వహించిన ప్రాక్టీస్ పరీక్షల ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిగత శ్రద్ధతో మెడిటేషన్ తరగతులు నిర్వహించి వారి ఉత్సాహాన్ని పెంపొందించడం కూడా ఫలితాలకు దోహదమైందని పేర్కొన్నారు. ఈ ఫలితాల్లో పీరిట్ పాఠశాల విద్యార్థిని చందన 96.81 పర్సెంటైల్ సాధించగా, కొండపల్లి రామ చరణ్ 94.94 పర్సెంటైల్, సోలంకి సిద్ధార్థ్ 94.35 పర్సెంటైల్, జానకి 93.46 పర్సెంటైల్, వెలంటి సాయిచంద్ 92.25 పర్సెంటైల్ సాధించారు. అదనంగా 48 మంది విద్యార్థులు 90.00 పర్సెంటైల్‌కు పైగా మార్కులు సాధించడం విశేషంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శేషకుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి..

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు)**

ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ., ఏ.ఈ.ఆర్.ఓ లతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్




స్థాయి అధికారులకు మ్యాపింగ్ లో సహాయకులుగా నియమించి మ్యాపింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏఈఆర్ఓ లు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రియ చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మా




ట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులతో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, తహశీల్దార్లు ఆనంతుల రమేష్, అరుణ, ఎన్నికల డిటి అన్సారీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్టూర్‌లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**పెద్దమందడి,ఫిబ్రవరి17(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు 72వ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పిటిసి రఘుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ దండు అశోక్, గ్రామ కమిటీ అధ్యక్షులు మల్లక్ సురేష్ కుమార్ కలిసి జన్మదిన కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాధనతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషి విశేషమని అన్నారు.రైతు సంక్షేమం, తాగునీటి సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలులో ఆయన చూపిన దూరదృష్టి రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిందని పేర్కొన్నారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# నూతన ప్రజాప్రతినిధులకు అభినందనలు

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు చేరవేయండి
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు)**

రాష్ట్ర రాజకీయాల్లో ఖమ్మం జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని ఖమ్మం అంటేనే కాంగ్రెస్ అడ్డా అనే నానుడిని మరోసారి నిరూపించి మున్సిపల్ ఎన్నికల్లో భారీ విజయం అందించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు అని అలాగే నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు వార్డు కౌన్సిలర్లకు అభినందనలు అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్,శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు లు అన్నారు.



మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతి సమస్యను తెలుసు కోవాలి సమస్యలకు పరిష్కారంలో ముందుండాలన్నారు. రాజకీయాలకతీతంగా ప్రతీ ఒక్కరి సమస్య విని...వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ విజయం నిఖార్సైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అంకితం అని అన్నారు. ఈ విజయం ఏ ఒక్కరిదీ కాదు ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్తది అని పేర్కొ న్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు ప్రజల నమ్మకాన్ని వొమ్ము చేయకుండా పని చేయాలని సూచించారు. ఇది ఏ ఒక్కరి విజయం కాదు. ఇది అందరి సమష్టి విజయం అని అన్నారు. నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ...కౌన్సిలర్ లు గా సేవ చేయడం గొప్పగా అవకాశంగా భావించాలని, మీ వార్డు లో చేసే అభివృద్ధి కలకాలం గుర్తుండి పోవాలన్నారు. మనం గెలిచింది ఈ ప్రాంతాన్ని బాగు చేయడం కోసం, కాలనీలను అభివృద్ధి చేసి ప్రజల ఆశీర్వాదం పొందడం కోసం అన్నది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొవాలని ఆయన అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపగడపకు చేరవేయాల్సిన భాధ్యత మున్సిపల్ కౌన్సలర్ గా ఎన్నికైన ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అదేవిధంగా ముందు జరగబోయే ఎం పీ టి సి, జెడ్ పి టి సి ఎన్నికలు త్వరలో వస్తాయని అందుకు జిల్లా కాంగ్రెస్ నాయకులు, బ్లాక్,మండల అధ్యక్షులు గ్రామ శాఖ అధ్యక్షులు,గ్రామ ముఖ్య నాయకులు సన్నద్ధం కావాలని తద్వారా కాంగ్రెస్ పార్టీని పటిష్ట పరుస్తూ అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని పత్రికా ముఖంగా కోరనైనది.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మొక్క శేఖర్ గౌడ్, నగర ఐ యన్ టి యు సి అధ్యక్షులు నరాల నరేష్ నాయుడు , నగర కాంగ్రెస్ నాయకులు కోసూరి ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# కోర్టు ఆదేశానుసారమే...భూదాన భూముల్లో పేదల ఇళ్లు

- న్యాయస్థానం ఆదేశాలను గౌరవించాలి
- పోలీసుల జోక్యం మానుకోవాలి
- ఇళ్లస్థలాలకు వెంటనే నీటి, విద్యుత్ వసతి కల్పించాలి
- జస్టిస్ బి.చంద్రకుమార్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు)**




కోర్టు ఆదేశానుసారం భూదాన భూముల్లో పేదలు ఇళ్లస్థలాలను నిర్మించుకున్నారని, వారికి వెంటనే నీటి వసతి, కరెంట్ సౌకర్యం తక్షణమే కల్పించాలని మాజీ హైకోర్టు న్యాయమూర్తి బి.చంద్రకుమార్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 2014లో వెలుగుమట్ల భూదాన భూమిని పేదల ఇళ్లస్థలాల కోసం కేటాయించబడిందని, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఆ ఇళ్లస్థలాలకు కనీస వసతులు ఏర్పాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం వారిని అక్కడ నుండి వెళ్లగొట్టేందుకు పోలీసుల ద్వారా బెదిరించే కార్యక్రమాలు చేయడం బాధాకరమని అన్నారు. భూదాన భూమిని కబ్జా చేసే ప్రయత్నంలో రాజకీయ నాయకులు ఉన్నట్లు ఆరోపించారు. అట్టి భూమి నుండి పేదలకు భయభ్రాంతులకు గురి చేసి వెళ్లగొడితే ఆ భూమిని కబ్జా చేసే అవకాశం ఉంటుందని అనుకోవడం అమాయకత్వమన్నారు. జిల్లా అధికారులు కోర్టు ఆదేశాలను అనుసరించి వెలుగుమట్ల భూదాన భూముల్లో ఇళ్లస్థలాలు ఏర్పాటు చేసుకున్న వారికి తక్షణమే సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఒత్తిడి మేరకు పోలీసులు ఒత్తిడి చేసి పేదలను వెళ్లగొట్టాలని చూస్తే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని, వారే బాధ్యులవుతారని హెచ్చరించారు. విజ్ఞతతో రాజ్యాంగం ప్రకారం కోర్టు ఆదేశాలను అనుసరించి వెలుగుమట్ల పేదలకు న్యాయం చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. భూదాన భూములను అమ్మే హక్కు, కొనే హక్కు ఎవరికీ లేవని స్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా రాజకీయ నాయకులు, కొంతమంది అధికారులు వెలుగుమట్ల భూములను ఆక్రమిస్తే న్యాయస్థానం ముందు నిలబడక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో భారత, చైనా మిత్రమండలి ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ డాక్టర్ మోహన్ రెడ్డి, సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణ, తెలంగాణ ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి డి.విజయేందర్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు భద్రు నాయక్, బిసి, ఎస్సి, ఎస్టి జెఏసి నాయకులు రాంబాబు, యర్రా బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కీసర, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం బోడుప్పల్‌లోని ప్రతాప్ సింగారంలో ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మహిళా నాయకురాళ్లు పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు.మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు సునీత మాట్లాడుతూ, సుధీర్ రెడ్డి నాయకత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచిందని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు దుర్గా, మేడ్చల్ 'ఏ' బ్లాక్ అధ్యక్షురాలు తాటికాయల కోమలత, దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షురాలు జూపల్లి శోభారాణి, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షురాలు సమతా యాదవ్, ఫీర్జాదిగూడ కార్పొరేషన్ రెండవ వార్డు అధ్యక్షురాలు తండా పరమేశ్వరి, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ శిల్ప తదితరులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో సుధీర్ రెడ్డి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. సుధీర్ రెడ్డి సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు





# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు చలివేంద్రం ప్రారంభోత్సవం

- ఆది జాంభవ అరుంధతి సేవాసమితి సేవా కార్యక్రమం

**కీసరగుట్ట, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తుల కోసం ఆది జాంభవ అరుంధతి సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు.సమితి అధ్యక్షుడు మొరుగు ముత్యాలు, ఫౌండర్ జనరల్ సెక్రటరీ బక్కని నర్సింగ్ రావు నాయకత్వంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ, మంచినీటి పంపిణీ చేపట్టారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఈ సేవను వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, భవిష్యత్తులో పూర్తి స్థాయిలో అన్నదానం, మజ్జిగ వంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ భక్తులకు సేవ చేయడంలో ముందుంటామని తెలిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన కొమ్ము సుదర్శన్, తుడుం శ్రీనివాస్, బక్కని కుమార్, మాజీ ఎంపీపీ రామారం సుజాత, బుడిగే జగన్, మంకి రాజు, కంచెమిది సంతోష్, చౌక్కాపురం శ్రీ రాములు, చినింగిని మల్లేష్, మంచాల రాజలింగం, రామారం రమేష్, తుడుం యాదగిరి, సైదులు మహారాజ్, కొమ్ము రవి, బండారి నర్సింగ్ రావు, గుడ్డేల రాము, మళగళ్ల శివకుమార్, బి. మధు, బోడ వెంకటేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అలాగే మీడియా ప్రతినిధులు, సీనియర్ నాయకులకు సమితి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.



# అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ

- పేద వృద్ధురాళ్లకు నెలసరి పింఛన్ పంపిణీ

**ఏ ఎస్ రావు నగర్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్‌లో అమావాస్య సందర్భంగా వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.సమాజ సేవలో భాగంగా ప్రతినెల పేద వృద్ధురాళ్లకు అందజేస్తున్న రూ.1000 చొప్పున పింఛన్‌ను ఈ సందర్భంగా మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పడకంటి కమలమ్మలకు అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వాసవి మిత్రమండలి చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు స్థానికులు అభినందించారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాసవి మిత్రమండలి అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్త, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్త, ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్త, తాటి శ్రీనివాస్ గుప్త, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్త, అమర కృష్ణ గుప్త, చందా సంతోష్ గుప్త, కార్యవర్గ సభ్యులు మిర్యాల అరుణ్ కుమార్ గుప్త, ఉప్పల ఆంజనేయులు గుప్త, ఉప్పల శ్రీనివాసులు గుప్త, బెలిదే బాగువాన్ గుప్త, రవ్వ ఈశ్వరరావు గుప్త, చంద్రగిరి తారకేశ్వర్ గుప్త, కమిశెట్టి రామలింగం గుప్త, పెద్ది నవీన్ గుప్త, రాయల సంతోష్ గుప్త, గజ్జల రమేష్ గుప్త, దిడిగం కైలాసం గుప్త, రాయికంటి ముత్యాల గుప్త, దాచా ప్రసాద్ గుప్త, పెద్ది శ్రీనివాస్ గుప్త, దారం అనిల్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



# జోర్డానో బ్రూనో 426వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**ఏ ఎస్ రావు నగర్, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు)**

ప్రముఖ తత్వవేత్త జోర్డానో బ్రూనో 426వ వర్ధంతి సందర్భంగా మంగళవారం రోజు కమలానగర్‌లోని స్ఫూర్తి గ్రూప్ కార్యాలయంలో ఘనంగా సంస్మరణ కార్యక్రమం నిర్వహించబడింది.కార్యక్రమాన్ని స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గౌడుగు యాదగిరిరావు ప్రత్యేక అధ్యక్షతన నిర్వహించారు. ప్రముఖ కళాకారుడు రుక్కయ్య, మహిళా నాయకురాలు శోభ తదితరులు బ్రూనో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాఖ్యానంలో యాదగిరిరావు మాట్లాడుతూ బ్రూనో సత్యాన్ని కనిపెట్టిన గొప్ప తత్వవేత్త అని గుర్తు చేశారు. ఆయన భూమి కేంద్ర సిద్ధాంతానికి బదులు సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని సూచించగా, మతవాదులు, పాలకులు ఆయన ఆలోచనలను అంగీకరించలేక మంటల్లో హతమార్చినట్లు చారిత్రక వివరాలు పేర్కొన్నారు. స్ఫూర్తి గ్రూపు నాయకుడు కృష్ణమాచార్యులు మాట్లాడుతూ బ్రూనోలో ప్రపంచం అనంతమని, అది ఎవరి సృష్టి కాకపోయే స్వతంత్ర భావనగా ఉన్నట్లు చెప్పారు. ఆయన వీసుంగ్ సంవత్సరాల పాటు జైల్లో నిర్బంధితుడయ్యాడు, తదుపరి అతి క్రూరంగా హత్య చేయించినట్లు వివరించారు. అంతేకాకుండా బ్రూనోను సత్యం బోధించినందుకు అత్యున్నత మతాధికారులు పెద్ద అల్లటలు చేశారని పేర్కొన్నారు.కార్యక్రమంలో సామాజిక ఉద్యమ నేత జయరాజు బ్రూనో జీవితం, కృతులు, శాస్త్రీయ విశ్లేషణను వివరించారు. అనంతరం ఇతర కార్యక్రమాలు జరుపుకుంటూ సభ్యులు బ్రూనో చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, గౌసియా, శోభ, అంజలి, శ్రీనివాస్, శారద, కోమటి రవి, నవతెలంగాణ రవి, ఉమామహేశ్వరరావు, జయరాజు, కృష్ణమాచారి, లక్ష్మయ్య, రుక్కయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు.

# ప్రతి విద్యార్థి చదివేలా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బోధన ప్రక్రియలు నిర్వహించాలి

**అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ**




**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు):** మంగళవారం ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలలోని మండల విద్యాశాఖ అధికారులు మరియు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఒక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. దీనికి జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదివేలా ప్రతి టీచర్ బాధ్యత వహిస్తూ బోధన అభ్యసన ప్రక్రియలను నిర్వహించాలని కోరారు. అదే విధంగా వారి వారి పాఠశాలల్లో జరుగుతున్న ఎఫ్రీ చైల్డ్ రైట్స్ అనే కార్యక్రమం ప్రగతిని సమీక్షించారు. అదేవిధంగా ఫౌండేషనల్ లీటరసీ మరియు న్యూమరసికి సంబంధించి మరియు ఎఫ్ ఎల్ ఎన్ శాంపిల్ స్టడీ కు సంబంధించి మరియు ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ కు సంబంధించినటువంటి పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి మరియు ఏడు మండలాల విద్యాశాఖ అధికారులు మరియు ఏడు మండలాలకు సంబంధించిన ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు

# కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో వసంతోత్సవం, పుష్పయాగం

**కీసర, ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):**





మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఐదవ రోజు వసంతోత్సవం, పుష్పయాగం కార్యక్రమాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు, ప్రధాన పూజారుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ వెంకటేశ్ శర్మ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ మండపంలో స్వామివారికి విశేష పుష్పాలంకరణ చేసి పుష్పయాగం నిర్వహించారు. వసంత ఋతువును ప్రతిబింబించేలా పసుపు, చందనం, వివిధ రకాల సువాసన గల పుష్పాలతో స్వామివారికి వసంతోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది.ఉత్సవాలలో భాగంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం మొత్తం పుష్పాలంకరణతో కళకళలాడగా, బ్రహ్మోత్సవాల ఐదవ రోజు కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి.

# మదర్ సేవ ట్రస్టు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేసిన ట్రస్టు చైర్మన్ మందడి ఇజ్రాయిల్



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17( తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం రూరల్ మండలంలోని చింతపల్లి గ్రామంలో మానవతా విలువలకు ప్రతీకగా మదర్ సేవ ట్రస్టు మంగళవారం నిరుపేద వృద్ధులు, పేద ప్రజలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేసింది. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ మందడి ఇజ్రాయిల్ మాట్లాడుతూ, చలికాలంలో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కప్పుకునే దుప్పట్లు కూడా లేక నిద్రలేని రాత్రులు గడుపుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వారి కష్టాలను చూసి స్పందించిన ట్రస్టు సభ్యులు వెంటనే దుప్పట్లు అందజేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం చేస్తేనే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. సేవే మన ధర్మం అని ఆయన పేర్కొన్నారు.మదర్ సేవ ట్రస్టు స్థాపన వెనుక ఉద్దేశం నిరుపేదలు, వృద్ధులు, బలహీన వర్గాలకు నిరంతర సేవ చేయడమేనని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో విద్య, ఆరోగ్యం, అత్యవసర సహాయం వంటి రంగాల్లో కూడా సేవా కార్యక్రమాలు విస్తరించనున్నట్లు తెలిపారు.ఈ సేవా కార్యక్రమం గ్రామస్థుల ప్రశంసలు అందుకుంది. చలిలో వెచ్చదనం మాత్రమే కాదు, మానవత్వం కూడా పంచిన మదర్ సేవ ట్రస్టుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మదర్ సేవ ట్రస్టు అధ్యక్షులు గండమల్ల యేసయ్య, గ్రామపంచాయతీ సర్పంచ్ భర్త అరెంపుల రాములు, ఆలేటి రంగయ్య, గ్రామ పంచాయతీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మతసామరస్యాన్ని చాటిన వేల్పుల దంపతులు

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు):** వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన వేల్పుల మురళి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వేల్పుల మురళి తన సొంత గ్రామంలో, తన సొంతడబ్బులతో మసీదుకు మైక్ వితరణగా అందజేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ చేతుల మీదుగా వేల్పుల మురళి వల్లాపురం మసీదుకు మైకు సీటును బహుకరణగా అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ, ఇప్పటికే గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు ఇప్పటికే నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల మురళి మతసామరస్యానికి ప్రతీకగా ముస్లిం సోదరులకు మసీదుకు మైకు అందించడం నిజంగా అభినందించదగ్గ విషయమని ఆయన వేల్పుల మురళిని ప్రత్యేకంగా అభినందించారు. మతసామరస్యానికి మనం అందరం ప్రత్యేకంగా నిలవాలని హిందూ ముస్లింలు భాయి భాయిగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, వైరా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాప చంద్రకళ మురళి గారు తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు..



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర సాధకులు, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, అపర భగీరధులు, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత, రైతుబంధు ప్రదాత, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ , ప్రదాత తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత, కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు సందర్భంగా తల్లాడ మండల పార్టీ ఆధ్వర్యంలో తల్లాడ రింగ్ సెంటర్లో ముఖ్య నాయకులు సర్పంచులు, ఉప సర్పంచ్లు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంచినారు. ఈ సందర్భంగా జై కేసీఆర్ జై జై కేసీఆర్ జై తెలంగాణ జై సంద్ర వెంకట వీరయ్య అనే నినాదాలు చేశారు. పార్టీ అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాస రావు శ్రీనివాసరావు, పార్టీ కార్యదర్శి దుగ్గిదేవర వెంకట లాల్, తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వర రావు (చిన్నబ్బాయి) మాట్లాడుతూ ..కెసిఆర్ 10 సంవత్సరాల కాలంలో దేశంలో తెలంగాణను అభివృద్ధిలోముందువరుసలో ఉంచారని, అదేవిధంగా వ్యవసాయంలో దేశంలోని అగ్రగామిగా నిలిపారని, ఆడబిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ అందించారని, ఆడబిడ్డలకు కేసీఆర్ కిట్ అందించారని, మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే నని, ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి , ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డిరెడ్డి తలాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, మండల పార్టీ కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్, జోనల్ చైర్మన్లు బద్దం కోట రెడ్డి, కేతినేని చలపతి రావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాయుడు శ్రీనివాసరావు, రుద్రాక్ష బ్రహ్మం, బీసీ సెల్ మాజీ అధ్యక్షులు కోడూరు వీర కృష్ణ, ఉప సర్పంచ్ ఇంజ కృష్ణార్జునరావు, శెట్టిపల్లి లక్ష్మణరావు, దగ్గుల రాశేఖర్ రెడ్డి, కంపాటి జమలయ్య, గుండ్ల వెంకటేశ్వరరావు, గుండ్ల నాగయ్య, ఇసనపల్లి వీరయ్య, తేళ్లూరి రఘు, బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఎస్ ఎస్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ టౌన్ ఉపాధ్యక్షులు సంఘసాని శ్రీను, బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ పమ్మీ కృష్ణారావు, ఇస్నపల్లి లక్ష్మణ్, ఇజ్జగాని గోవిందరావు, మారెళ్ళ దేవేందర్, మరి బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కట్ల సంతోష్‌ను సన్మానించిన మధు విద్యాలయం పదో తరగతి మిత్రులు...

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు):** వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా నిన్న నియమితులు కాబడ్డ కట్ల సంతోష్ ను 2000 సంవత్సరం మధు విద్యాలయం పదో తరగతి స్నేహితులు ఘనంగా సన్మానించారు. తమ తోటి మిత్రుడు చిన్న వయసులోనే మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా నియమితులు కావడం చాలా సంతోషకరమని, వైరా మున్సిపాలిటీలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను తీర్చడంలో ముందుండాలని వారు ఆకాంక్షించారు. మునుముందు మరెన్నో ఉన్నత పదవులు ఆరోదించాలని వారు పేర్కొన్నారు. సన్మానించిన వారిలో స్నేహితులు మూల దుర్గాప్రసాద్, మిట్టపల్లి విజయ్, ఆరుట్ల సనత్ కుమార్, తలపురెడ్డి రాజశేఖర్ రెడ్డి, అనుబోతు రామకృష్ణ, దుద్దుకూరి బాబురావు, ముదిగొండ కృష్ణ, నిమ్మల శ్రీకాంత్, ఎర్నాకుల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



# కార్పొరేటర్ లకు శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు..

**ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 17 (తెలంగాణ ముచ్చట్లు)**

కొత్తగూడెం కార్పొరేషన్ అభివృద్ధిలో నూతన పాలకవర్గం చురుకైన పాత్ర పోషించాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు ఆకాంక్షించారు. కొత్తగూడెం కార్పొరేషన్ సోమవారం నూతన పాలకవర్గం ఘనంగా కొలువుదీరింది. కార్పొరేషన్ కార్యాలయంలో పదవీ బాధ్యతలను స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేసిన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేషన్ అభివృద్ధిలో నూతన పాలకవర్గం చురుకైన పాత్ర పోషించాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు.



# డాక్టర్ శ్రీమతి కాపా చంద్రకళకి, ప్రభుత్వ జూనియర్ కళాశాల తరపున అభినందనలు..

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు ):** ఇటీవల వైరా మున్సిపాలిటీ కి జరిగిన ఎన్నికల్లో గెలిచి వైరా మున్సిపాలిటీ చైర్పర్సన్ గా ఎన్నికైన డాక్టర్ శ్రీమతి కాపా చంద్రకళ కి ఈరోజు స్థానిక వైరా పట్నంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల తరపున అభినందనలు తెలియజేసినట్లు, కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి ఎల్ నవీన జ్యోతి తెలిపారు. మంగళవారం కళాశాల తరపున టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీమతి కాప చంద్ర కళ ని కలిసి అభినందిస్తూ పూల మొక్కను బహకరించి ,శాలువతో చిరు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారి ఆధ్వర్యంలో వైరా పట్టణం అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ, కళాశాల అభివృద్ధికి సహాయం చేయవలసిందిగా కోరగా ,మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ శ్రీమతి కాపా చంద్రకళ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ ,నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్రాన్ని దేశం గర్వించేలా తీర్చిదిద్దిన దిశాలి కేసీఆర్...

**పోట్ల శ్రీను**

**ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 17(తెలంగాణ ముచ్చట్లు):** కొణిజర్ల తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కె సి ఆర్) జన్మదిన వేడుకలు కొణిజర్ల మండల కేంద్రంలో పండుగ వాతావరణంలో జరిగాయి. మండల అధ్యక్షుడు శ్రీ పోట్ల శ్రీను నేతృత్వంలో కేక్ కట్ చేసి, కేసీఆర్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పోట్ల శ్రీను మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, దేశం గర్వించేలా తీర్చిదిద్దిన ధీశాలి కేసీఆర్ అని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేడు ప్రతి ఇంటికీ చేరాయి. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నాం అని కొనియాడారు.ఈకార్యక్రమంలో బోడపోతుల బాబు, దొడ్డపనేని రామారావుసర్పంచ్ లు పోగుల శ్రీను, నూనావత్ శ్రీను, గూగులోత్ చందు, మాజీ సర్పంచ్ రోషన్ బెగ్, చిరంజీవి, రాయల నాగయ్య,ముత్యాల నాగేశ్వర రావు, ఖాదర్ బాబా, సురేష్, రాధ, నగేష్ దామ విజయ్, బాబు లాల్ సోమయ్య, సురేష్, కొమ్మినేని వెంకటేశ్వర్లు ,శ్రీనివాస్ రావు, వెంకన్న, కృష్ణ, నాగేశ్వరరావు, కృష్ణయ్య, లక్ష్మయ్య
గోపాల్, వెంకీ, శివ, కృష్ణార్జున రావు, రాంజీ, కిషోర్ , వెంకట రత్నం, సతీష్, . వెంకటేశ్వర్లు, అనుమోలు శ్రీను,నరసింహ రావు, సెల్వరాజు, సత్యాలు, ప్రసాద్,చిన్న, మల్లామల ప్రసాద్, పిరు నాయక్,ఉప సర్పంచ్ సొందు, దుంపల ప్రకాశం కార్యకర్తలు పాల్గొన్నారు .

# ఫిబ్రవరి 19న జాబ్ మేళా నిర్వహణ...

**జిల్లా ఉపాధికల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -17(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం పేటీఎం సేల్స్ & సర్వీస్, ఖమ్మం నందు ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 19న గురువారం ఉదయం 10.00 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.2040 సంవత్సరాల వయస్సు, ఎస్ఎస్సి/ఇంటర్/డిగ్రీ అర్హత కలిగి ఖమ్మంలో పని చేసే విధంగా సేల్స్ అండ్ సర్వీస్ లో 100 ఉద్యోగాల భర్తీ కొరకు జాబ్ మేళాకు హాజరు కావాలని, ఎంపికైన వారికి నెలకు వేతనం 15 వేల నుండి 18 వేల వరకు ఉంటుందని, ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. వివరాల కొరకు హెచ్ఆర్ ను మొబైల్ నెం. 8185863275, 9866771213 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధికల్పన అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## సర్వంమాయ డెలులు బ్యాక్‌గ్రౌండ్ ఇదే

గత ఏడాది డిసెంబర్‌లో మలయాళంలో ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజైన సర్వంమాయ మూవీ బాక్సాఫీస్ వద్ద సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. కేవలం 30 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ 150 కోట్లకుపైగా కలెక్షన్స్ రాబట్టింది. మలయాళ సినీ చరిత్రలోనే అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. రొమాంటిక్ హారర్ కామెడీగా తెరకెక్కిన ఈ సినిమాలో నివీన్ పాల్, రియా శిబు, ప్రీతి ముకుందన్ హీరోహీరోయిన్లుగా నటించారు. ఈ సినిమాలోనే అఖిల్ సత్యన్ డైరెక్టర్‌గా మాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. థియేటర్లలోనే కాకుండా ఓటీటీలోనూ సర్వంమాయ అదరగొడుతోంది. ఇటీవల జియో హాట్‌స్టార్‌లో రిలీజైన ఈ సినిమా గత రెండు వారాలుగా ట్రెండింగ్‌లో ఉంది.

అందమైన దయ్యంతో ప్రేమలో పడిన ఓ యువకుడి కథతో దర్శకుడు అఖిల్ సత్యన్ ఈ సినిమాను తెరకెక్కించారు. సర్వం మాయ స్టోరీ కొత్తదేమీ కాదు. కానీ నివీన్ పాల్, రియా శిబు కెమిస్ట్రీ, వారిద్దరి లవ్‌స్టోరీని డైరెక్టర్ ప్రజెంట్ చేసిన తీరుకు ఆడియెన్స్ ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా రియా శిబు చేసిన డెలులు క్యారెక్టర్ యూత్ ఆడియెన్స్ క్లీన్ బౌల్డ్ అవుతున్నారు. డెలులు పాత్రలో ఆమె క్యూట్‌నెస్, నాచురల్ స్క్రీన్‌ప్రజెన్స్, ఎక్స్‌ప్రెషన్స్ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. సర్వంమాయతో ఓవర్‌నైట్‌లోనే స్టార్‌గా మారిపోయింది రియా శిబు. ఈ సినిమాతో రియా శిబుకు అవకాశాలు వెల్లువెత్తుతున్నాయట. డెలులు పాత్ర కోసం తొలుత ప్రియా ముకుందన్‌ను అనుకున్నారట డైరెక్టర్. కానీ చివరలో ఆమెను కాదని రియా శిబును సెలెక్ట్ చేశారు.

సర్వంమాయతోనే హీరోయిన్‌గా ఫస్ట్ హిట్ అందుకుంది రియా శిబు. ఈ సినిమా కంటే ముందు కప్ పేరుతో ఓ మలయాళ సినిమా చేసింది. ఆ మూవీని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. సర్వంమాయతో స్టార్‌గా మారింది. యాక్టర్‌గా కంటే ముందు రియా శిబు ఓ నిర్మాత. ప్రొడ్యూసర్‌గానే ఆమె సినీ కెరీర్ ప్రారంభమైంది. హిందీ, తమిళంతో పాటు మలయాళంలో సినిమాలు చేసింది. విజయ్ సేతుపతి బాలీవుడ్ మూవీ ముంబైకర్, చియాన్ విక్రమ్ వీర ధీర శూరన్ 2 సినిమాలకు రియా శిబునే నిర్మాత. యంగ్ ఫిమేల్ ప్రొడ్యూసర్ గా రికార్డు నెలకొల్పింది.

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా నటించిన ఆస్కార్ విన్నింగ్ మూవీ ఆర్ఆర్ఆర్‌ను మలయాళంతో తన తండ్రి శిబు థామిన్స్‌తో కలిసి రియా శిబు రిలీజ్ చేసింది. ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో కలిసి ప్రమోషన్స్‌లో పాల్గొన్నది. ప్రొడ్యూసర్‌గా రాని గుర్తింపు ఒక్క సర్వంమాయ సినిమాతోనే రియా శిబుకు వచ్చింది. రియా శిబు సోదరుడు హృదు హరూన్ కూడా హీరోగా చాలా సినిమాలు చేశాడు.



## సినిమాలు తీసి అప్పుల పాలయ్యా – మంచు లక్ష్మి కామెంట్స్

సినిమాలు నిర్మించి అప్పుల పాలయ్యానని మంచు లక్ష్మి అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తమిళ మూవీ పూకీ గత వారం థియేటర్లలో రిలీజైంది. ఈ సినిమాతోనే దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత కోలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇచ్చింది మంచు లక్ష్మి. పూకీ సినిమాను కోలీవుడ్ హీరో విజయ్ ఆంటోనీ నిర్మించారు. అంతే కాకుండా ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా, ఎడిటర్‌గాను వ్యవహరించాడు. విజయ్ ఆంటోనీ మేనల్లుడు అజయ్ దిషాన్ ఇందులో హీరోగా నటించాడు. పూకీ సినిమా తెలుగులో బూకీ పేరుతో ఫిబ్రవరి 20న థియేటర్లలోకి రాబోతుంది. బూకీ మూవీ ప్రెస్‌మీట్‌ను మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ వేడుకలో మంచు లక్ష్మి పాల్గొన్నది. తెలుగులో సినిమాలు నిర్మించి తాను అప్పుల పాలయ్యానని అన్నది. ఐదేళ్ల క్రితం తీసిన ఓ సినిమా అప్పులను తాను ఇప్పటికీ కడుతున్నానని చెప్పింది. ఆ అప్పులను తీర్చడానికే ఇతర సినిమాల్లో క్యారెక్టర్లు చేస్తున్నానని చెప్పింది. బూకీ యూత్‌ఫుల్ మూవీ అని మంచు లక్ష్మి అన్నది. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో డైరెక్టర్ ఈ సినిమాను రూపొందించారని, కొరియన్ లాంగ్వేజ్‌లో చూసిన ఈ సినిమా అర్థమవుతుందని తెలిపింది. సైకియాట్రిస్ట్‌తన పాత్ర తాలూకు ఎక్స్‌ప్రెషన్స్ గమ్మత్తుగా ఉంటాయని చెప్పింది. నా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూసి ఈ సినిమాలో అవకాశం ఇచ్చానని డైరెక్టర్ అన్నాడు. "చాలా ఫన్నీగా క్యారెక్టర్‌ను డిజైన్ చేశారు. ఈ సినిమాకు తెలుగుతో పాటు తమిళంలోనూ నేనే సొంతంగా డబ్బింగ్ చెప్పా. ఇందులో పాట పాడే అవకాశం ఇవ్వమని విజయ్ ఆంటోనీని అడిగా. కానీ నెక్స్ట్ సినిమాలో అవకాశం ఇస్తానని ఆయన మాటిచ్చాడు సినిమా కంటే నేనే బయటే బాగుంటావని చాలా మంది నాతో అంటుంటారు. కానీ నాకు మాత్రం సిల్వర్ స్క్రీన్‌పైనే అందంగా కనిపించాలని ఉంటుంది. . ఇందులో హీరోయిన్ ధనూషతో పాటు నన్ను చాలా బాగా చూపించారు" కెమెరామెన్ అని అన్నది.



## ఒకే సారి మూడు అవార్డులు గెలుచుకున్న నయన్

సౌత్ ఇండస్ట్రీలో మోస్ట్ బిజీయెస్ట్ హీరోయిన్‌గా కొనసాగుతోంది నయనతార. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ...ఇలా అన్ని భాషల్లో ఆమె హవా కొనసాగుతోంది. ఆఫర్ల విషయంలోనే కాదు రెమ్యూనరేషన్లలో నయనతారనే దక్షిణాదిలో నంబర్ వన్ ప్లేస్‌లో ఉంది. ప్రస్తుతం ఒక్కో సినిమాకు పదమూడు కోట్ల వరకు రెమ్యూనరేషన్ తీసుకుంటోంది. సినిమాల పరంగానే కాకుండా ...అవార్డుల విషయంలో తగ్గేదేలే అని నయనతార నిరూపించింది. ఇటీవల తమిళనాడు ప్రభుత్వం 2016 - 2022 వరకు ఆరు సంవత్సరాల స్టేట్ ఫిల్మ్ అవార్డులను ప్రకటించింది. ఇందులో నయనతార మూడు అవార్డులను గెలుచుకుంది. నటిగానే కాకుండా ప్రొడ్యూసర్‌గా కూడా పురస్కారాన్ని అందుకుంది. నయనతార నటించిన లేడీ ఓరియెంటెడ్ సినిమాలు అరమ్, నేత్రికన్, కూజంగళ్ సినిమాలు స్టేట్ అవార్డుల్లో సత్తా చాటాయి. ఇందులో నేత్రికన్, కూజంగళ్ సినిమాలకు నయనతారనే నిర్మాత. 2021 ఏడాదికి ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగంలో నయనతార నేత్రికన్ అవార్డును సొంతం చేసుకుంది నయనతార హీరోయిన్‌గా నటించిన సర్వైవల్ థ్రిల్లర్ మూవీ అరమ్ మూడు అవార్డులను గెలచుకుంది. ఈ సినిమాలో కలెక్టర్ పాత్రలో అసమాన నటనకు గాను బెస్ట్ హీరోయిన్‌గా నయనతార అవార్డును స్వీకరించింది. 2017 ఏడాదికిగాను బెస్ట్ ఫిల్మ్‌గా అరమ్ నిలిచింది. బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా సును లక్ష్మికి కూడా పురస్కారాన్ని దక్కించుకుంది. హీరోయిన్‌గానే కాకుండా ప్రొడ్యూసర్‌గా కూడా నయనతార తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డు దక్కించుకోవడం గమనార్హం. భర్త విఘ్నేష్ శివన్‌తో కలిసి నయనతార నిర్మించిన కూజంగళ్ మూవీ 2020 ఏడాదికిగాను బెస్ట్ మూవీగా ఎంపికైంది. ఈ సినిమాలో కీలక పాత్ర పోషించిన చెల్లపాండి బెస్ట్ చైల్డ్ యాక్టర్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఇటీవల స్టేట్ ఫిల్మ్స్ అవార్డుల ప్రదానోత్సవ వేడుక జరిగింది. మూడు స్టేట్ అవార్డులతో దిగిన ఫొటోలను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంది నయనతార. నటిగా ఈ అవార్డులు తన బాధ్యతను మరింత పెంచాయని తెలిపింది. మా సంస్థ నిర్మించిన సినిమాలకు పురస్కారావాలు రావడంతో ఆనందం రెట్టింపు అయ్యిందని అన్నది. ఇటీవలే మన శంకర వరప్రసాద్‌గారుతో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను అందుకుంది నయనతార. ప్రస్తుతం తొమ్మిది సినిమాలు చేస్తోంది. టాక్సిక్, ముక్కుత్తి అమ్మన్ 2, హాయ్‌తో పాటు నయనతార నటించిన పలు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి.

## సందిగ్ధ దశ!



తెలీట్లేదు ఏం మారిందో
పొడిచే పొద్దు
అస్తమించే సూరీడు
వుంటున్న ఇల్లు
చేస్తున్న జాబు
ఏదీ మారలేదు.

ఆ నింగి
ఈ నేల
ఎక్కడివక్కడే వున్నాయి.
బస్సులు, రైళ్ళు
రాకెట్స్, శాటిలైట్స్
ఎప్పటిలానే
వేటికవే పరుగెడుతున్నాయి
తెలీట్లేదు
అసలు ఏం మారిందో!

కానీ
ఏదో మారినట్టు,
ఉన్నట్టుండి ఏదో మాయమైనట్టు,
నాలో అంతా
ఏదో ఖాళీతనం.

దియా విఘ్నేష్



## ఇళయరాజాకు కోర్టు ఆదేశాలు

ఇదివరకు ఇళయరాజా పేరు వింటే ఎవర్‌గ్రీన్ సాంగ్స్ గుర్తొచ్చేవి. ఇప్పుడు మాత్రం ఆయన పేరు వింటే కాపీరైట్ ఉల్లంఘన కేసులే ఎక్కువగా గుర్తొస్తున్నాయి. తాను కంపోజ్ చేసిన పాటలు వాడిన సినిమాలపై కాపీరైట్ ఉల్లంఘన కేసులు వేస్తూ వచ్చారు ఇళయరాజా. ఆయన పాట వాడాలంటేనే దర్శకనిర్మాతలు భయపడే పరిస్థితి నెలకొంది. ఇటీవల రిలీజైన ఓ తెలుగు సినిమాలో ఇళయరాజా కాపీరైట్ కేసుల వ్యవహారాన్ని ఓ జోక్‌గా వాడుకునే వరకు పరిస్థితి వచ్చింది.

మంజుమ్మల్ బాయ్స్, గుడ్ బ్యాడ్ అగ్లీ, కూలీతో పాటు పలు సినిమాలపై ఇళయరాజా కేసులు వేశారు. అనుమతి లేకుండా తన సినిమాల పాటలు వాడద్దంటూ హెచ్చరిస్తున్నారు. సినిమాల్లోనే కాకుండా కాన్సెర్ట్‌లు, టీవీ షోలతో పాటు ఇతర ఈవెంట్లలోనే ఇదే రూల్ ఫాలో కావాలని డిమాండ్ పెడుతున్నారు ఇళయరాజా. ఒకవేళ పాటలు వాడాలనుకుంటే ఇళయరాజా అనుమతి తీసుకోవడమే కాకుండా రాయల్టీగా కొంత మొత్తం చెల్లించాల్సిఉంటుందని కండీషన్లు పెడుతూ వచ్చాడు.

తాజాగా ఇళయరాజాకే ఢిల్లీ కోర్టు షాకిచ్చింది. తాను కంపోజ్ చేసిన పాటలనే ఇళయరాజానే వాడొద్దంటూ ఉత్తర్వులు జారీ చేసింది. శివ, స్వాతిముత్యం, సాగర సంగమం, నాయకుడు, దళపతితో పాటు... 1976 నుంచి 2001 మధ్యకాలంలో తాను మ్యూజిక్ అందించిన 134 సినిమాల్లోని పాటలకు సంబంధించిన సర్వ హక్కులు తనవే అంటూ ఇళయరాజా ఇటీవల అమెజాన్ ప్రైమ్, ఐట్యూన్స్ వంటి సంస్థలకు అమ్మారు. ఆయా సినిమాల నిర్మాతలు ఆ 134 సినిమాల మ్యూజిక్ రైట్స్‌ను సరిగమ సంస్థకు ఇచ్చేశారు. దాంతో ఇళయరాజాపై సరిగమ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ సినిమాల పాటలపై సరిగమపకే హక్కులు ఉన్నాయని, ఈ కేసులో తుది తీర్పు వచ్చే వరకు ఈ 134 సినిమాల్లోని పాటలను ఇళయరాజా కూడా వాడటానికి వీలులేదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇళయరాజా సంగీతం అందించే సినిమాలతో పాటు ఆయన కాన్సెర్ట్‌లలో కూడా ఈ పాటలు వాడటానికి వీలులేదని తెలిపింది. సినిమాలకు మ్యూజిక్ అందించినందుకు ఇళయరాజా నిర్మాతల నుంచి రెమ్యూనరేషన్ తీసుకుంటున్నాడు కాబట్టి...ఆ సినిమాల్లోని పాటల హక్కులు నిర్మాతలకే ఉంటాయని తెలిపింది. వాటిని నిర్మాత ఎవరికైనా విక్రయించే హక్కు ఉందని కోర్టు తెలిపింది. ఈ మధ్యంతర ఉత్తర్వులపై నెల రోజుల్లోపు స్పందించాల్సిందిగా ఇళయరాజాను ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణ ఏప్రిల్ 2న జరుగనుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in